

నవభూమి

నిజామాబాద్

అనుబంధం

27 మే,2025 మంగళవారం పేజీలు:2

www.epaper.navabhoomi.in


## సంపూర్ణ అక్షరాస్యత సాధనకు సమిష్టిగా

# కృషి చేయాలి



**కంటేశ్వర్, -నవభూమి:** నిజామాబాద్ ను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమిష్టిగా, అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలలోని ప్రతీ సభ్యురాలి విద్యార్హతలు గుర్తిస్తూ, నిరక్షరాస్యులుగా ఉన్న వారికి చదవడం, రాయడం నేర్పించాలనే బృహత్తర సంకల్పంతో రాష్ట్రంలోనే తొలిసారిగా సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, సమగ్ర శిక్ష, వయోజన విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఇందూరు అక్షరలక్ష్మి పేరుతో రూపొందించిన యాప్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఐడీఓసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి సోమవారం ఆవిష్కరించారు.సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా యాప్ ను రూపొందించడం పట్ల కలెక్టర్ సంబంధిత అధికారులను అభినందించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలలో సుమారు 3.40 లక్షల మంది సభ్యులు కొనసాగుతున్నారని కలెక్టర్ గుర్తు చేశారు. ఇందూరు అక్షర లక్ష్మి యాప్ ద్వారా సీ.సీలు, వీ.ఓ.ఏ ల సహాయంతో ప్రతి ఎస్.హెచ్.జీ సభ్యురాలి విద్యా సంబంధిత వివరాలను సేకరించి యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. నిరక్షరాస్యులుగా గుర్తించబడిన వారికి అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామాల్లో అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు.అదేవిధంగా పదో తరగతి లోపు చదువుకున్న వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి పరీక్షలు రాయించడం, ఎస్ఎస్సి ఉత్తీర్ణులైన వారిని ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయించనున్నట్లు తెలిపారు. గణాంకాల ప్రకారం జిల్లాలో మహిళల అక్షరాస్యత 55 శాతంగా ఉందని, సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం అమలు ద్వారా నూటికి నూరు శాతం మహిళా అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. నిర్ణీత కాల వ్యవధిని నిర్దేశించుకుని, లక్ష్య సాధన కోసం అంకిత భావంతో కలిసి కట్టుగా కృషి చేయాలని హితవు పలికారు. 2026 మార్చి నెలలో జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల సమయం నాటికి స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులను ఓపెన్ ఎగ్జామ్స్ కు సన్నద్ధం అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు.సంపూర్ణ అక్షరాస్యత సాధన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయాగౌడ్, ఏ.పీ.డీ రవీందర్, డీఈఓ అశోక్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, వయోజన విద్యా సంయుక్త సంచాలకులు గోవింద్ రావు, స్వయం సహాయక మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు

# విస్తృత ఏర్పాట్లు



**కంటేశ్వర్, -నవభూమి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. జూన్ 2న నిజామాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఓవర్సీస్ స్కాలర్షిప్ స్కీం, మహాలక్ష్మి పథకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, వ్యవసాయం, వైద్యారోగ్యం తదితర శకటాలను ప్రదర్శించాలని సూచించారు.అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఏసీపీలు రాజావెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రుణమాఫీ సెగలు!



2

# జింకపై వీధి కుక్కల దాడి



2

# పోతంగల్‌లో 30 పడుకల ఆసుపత్రి నిర్మించాలి



**పోతంగల్ -నవభూమి:** మండలకేంద్రంలో 30 పడుకల ఆసుపత్రి నిర్మించాలని, ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల హన్మండ్లు మట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం మండల కేంద్రానికి 30 పడకల ఆసుపత్రిని నిర్మించాలని అన్నారు.ప్రస్తుతం ఉన్న ఆరు పడకల ఆసుపత్రిని 30 పడకలకు పెంచడంతో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. గర్భిణీలు డెలివరీ సమయంలో ఇబ్బందులు ఎదురుకోవలసిన పరిస్థితి ఉందని, అన్ని రకాల జబ్బులకు మండల కేంద్రంలో నే 24 గంటలు వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగం సాయిలు, కిరణ్, అశోక్, దత్తు, శ్రీకాంత్, శంకర్, గంధపు హన్మండ్లు తదితులున్నారు.

# 108 పైలట్ దినోత్సవం సందర్భంగా పలువురికి సన్మానం




**పోతంగల్ -నవభూమి:** మండల కేంద్రంలో 108 పైలట్ దినోత్సవం సందర్భంగా మండల బీజేపీ ఆధ్వర్యంలో 108 సిబ్బందికి పలువురు నాయకులు శాలువాతో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు బజరంగ్ హన్మండ్లు మాట్లాడుతూ మండలంలో అంబులెన్స్ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ సమచారమందిన వెంటనే బాధితులను ఆస్పత్రులకు తరలిస్తున్నరని తెలిపారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడంలో పైలట్ల పాత్ర కీలకమని ఆయన అన్నారు. విఘత్కర సమయాల్లో 108 అంబులెన్స్‌లో సమర్ధవంతంగా సేవలను అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడటంలో పైలట్లు ముందుంటున్నట్లు పేర్కొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతల ఆందోళన

**కంఠేశ్వర్, -నవభూమి:** తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అకాల వర్షానికి తడిసి ములకలెత్తిన ధాన్యాన్ని చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పండిన పంటలు మొలకెత్తి సర్వనాశనం అవుతున్నాయని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎటువంటి తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని చెప్పిందని, అయినా కూడా రైస్ మిల్లులు వ్యాపారులు ఒక్కో బస్తాకు ఎనిమిది నుండి పది కిలో తరుగు తీస్తామని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలులో జాప్యం చూపుతూ పూర్తిగా ప్రభుత్వ నిర్లక్షంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

# రుణమాఫీ సెగలు!

**నిజామాబాద్, -నవభూమి:** రైతులందరికీ రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల వేళ రైతులకు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలుచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులను నిలదీస్తున్నారు. దీనిపై రైతులకు సమాధానం చెప్పలేక అధికార పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల రెంజల్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పర్యటించగా..రైతులు చుట్టుముట్టి రుణమాఫీపై ప్రశ్నించారు.ప్రజావాణి కార్యక్రమంలోనూ ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు రైతుల నుంచి నిరసన సెగలు తప్పడంలేదు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ హెూదాలో ఇచ్చిన హామీకే దిక్కులేకుండా పోయిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నిలకు ముందు ఓ మాట.. అధికారం వచ్చాక మరో మాట మార్చడంపై మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతురుణమాఫీ ప్రక్రియ ఒక అడుగు ముందుకు, పదడుగులు వెనక్కిలా మారింది. గతేడాది ఆగస్టు 15న మొదలైన ఈ ప్రక్రియ నాలుగు విడుతలుగా అమలై ఆగిపోయింది.సగాని కన్నా తక్కువ మందికి మాత్రమే రుణమాఫీ వర్తించడంతో మిగతావారి పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. మా పరిస్థితి ఏమిటి? అంటూ రైతులు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీస్తుండడం గమనార్హం. రుణమాఫీ కోసం చెప్పులరిగేలా రైతులు తిరుగుతున్నప్పటికీ పాలకుల్లో శ్రద్ధ కనిపించడం లేదు. రుణమాఫీ పేరు ఎత్తాలంటేనే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వణికి పోతున్నారు. తమ ప్రసంగాల్లో మొన్నటి వరకూ రుణమాఫీ చేశామంటూ చెప్పుకొచ్చిన వారంతా ఇప్పుడు రుణమాఫీ పేరు ఎత్తాలంటే వెనుకడుగు వేస్తున్నారు.బ్యాంకర్ల నుంచి వేధింపులు..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల పంట రుణాలను రద్దు చేస్తామని పీసీసీ చీఫ్ హెూదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అనేక బహిరంగసభలు, ఎన్నికల ప్రచారంలోనూ స్పష్టం చేశారు. 2023 డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారు. వంద రోజుల్లోనే పంట రుణాలను



మాఫీ చేస్తామని చెప్పిన నేతలే రైతులను దగా చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ వెంటాడి రుణమాఫీ కోసం ఉద్యమించడంతో చేసేది లేక 2024, ఆగస్టు 15న రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో శ్రీకారం చుట్టింది. అరకొరగా పంట రుణాలను మాఫీ చేసింది. ఆ తర్వాత రైతులంతా రోడ్డు ఎక్కి కాంగ్రెస్ నేతలను నిలదీయడంతో రెండు, మూడు విడుతల్లోనూ రుణమాఫీ జరిగింది. తీరా రుణమాఫీ రాని వారంతా ఆందోళన చేయడంతో చివరిగా నాలుగో విడుతను సైతం విడుదల చేసింది. అయినప్పటికీ సగం మందికిపైగా రైతులు ఇప్పటికీ మాఫీ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మొత్తం పంట రుణాలను చెల్లించలేక, వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు బ్యాంకు అధికారుల నుంచి తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.ఎక్కడికక్కడ నిలదీతలు రెంజల్ మండలంలో కలెక్టర్‌ను రైతులు చుట్టుముట్టి రుణమాఫీ వర్తింపజేయాలంటూ ప్రశ్నలు సంధించారు. అచ్చంగా ఇలాంటి పరిస్థితే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనూ కనిపిస్తున్నది. ప్రభుత్వతీరుపై రైతుల్లో నివురు గప్పిన నిప్పులా అసంతృప్తి పేరుకు పోయింది. కాంగ్రెస్ నేతలెవరైనా ఎదురు పడితే చాలు రుణమాఫీపై నిలదీస్తుండడంతో సరైన సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్లు చేసి వివరాలు కనుక్కునే ప్రయత్నాలు చేస్తుండగా ప్రభుత్వ వైఫల్యమే కారణమని సమాధానం వస్తుండడడంతో రైతులను నచ్చజెప్పలేక చతికిల పడుతున్నారు.ఉమ్మడి జిల్లాలో 1.77లక్షల మందికి మొండి'చేయి' నిజామాబాద్ జిల్లాలో మొత్తం 2లక్షల 3వేల 520 మంది రైతులున్నారు. వీరిలో లక్షా 555 మందికి రూ.781కోట్లు పంట రుణాలు రద్దు చేశారు. ఇంకా లక్షా 2వేల 265 మందికి రుణమాఫీ కాలేదు. కామారెడ్డి జిల్లాలో లక్షా 76వేల మంది రైతులు రుణాలు తీసుకోగా ఇందులో లక్షా ఒక వేయి 417 మందికి రూ.736కోట్లు రుణమాఫీ వర్తించింది. 75వేల మందికి మొండిచేయి చూపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1.77లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉన్నది. రుణమాఫీ జాబితాను రూపొందించడంలో బ్యాంకర్లు, సహకార శాఖ, వ్యవసాయ శాఖ అధికారుల తప్పిదాలు.. రైతులకు శాపంగా మారాయి.కొద్ది మంది రైతులను ప్రభుత్వ ఉద్యోగులుగా చిత్రీకరించి అనర్హులుగా మార్చారు. మరికొంత మందికి రైతుల ఆధార్ కార్డు నంబర్లను తప్పుగా నమోదు చేశారు. పట్టాదారు పాసుపుస్తకాల వివరాల్లోనూ తప్పులను వ్యవసాయ శాఖ పేర్కొంది. రైతులు తీసుకున్న రుణాలను నమోదు చేయడంలో సహకార సంఘాల్లోని ఉద్యోగులు పొరపాట్లు చేయడం కూడా రుణమాఫీ రాకపోవడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. వివరాలు సవ్యంగా ఉన్నప్పటికీ, సర్కారు కొర్రీలు విధించిన నిబంధనల మేరకు అర్హతలు కలిగిన రైతులకు సైతం ఇంత వరకూ రుణమాఫీ జాబితాలో పేరు నమోదుచేయలేదు. దీంతో వీరంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

# యాద్గర్పూర్‌లో జింకపై వీధి కుక్కల దాడి

**కోటగిరి -నవభూమి:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలో యాద్గర్పూర్ గ్రామంలో దారి తప్పి వచ్చిన జింకపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్ర గాయాలు పాలు చేసిన ఘటన యాద్గార్ పూర్ లో సోమవారం చోటు చేసుకుంది. అటవీ శాఖ అధికారులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. కోటపల్లి మండలం యాద్ గార్పూర్ గ్రామంలో ఉదయం ఆరు గంటల సమయంలో దారుతప్పి ఓ జింక గ్రామంలో వచ్చింది.దీంతో వీధి కుక్కలు ఒక్కసారిగా జింకపై దాడి చేశాయి. ఈ దాడిలో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వీధి కుక్కలను తరిమివేశారు. గాయాల పాలైన జింకను సురక్షిత ప్రదేశంలోకి తీసుకొచ్చి అటవీ శాఖ అధికారులకు సమాచారమందించారు. అటవీ శాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు.ఘటన కు సంబంధించిన వివరాలు తెలుసుకొని, గాయల పాలైన జింకను కోటగిరి పశు వైద్యశాలకు తరలించారు. స్థానిక వెటర్నరీ డాక్టర్ సురేష్ కుమార్ జింక కు చికిత్స అందించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు జింక



ను అప్పగించారు. ఈ కార్యక్రమంలో వర్ని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సురేష్, రాజు, గ్రామస్తులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.